నేటితో ముగియనున్న కార్పొరేటర్‌ల పదవీకాలం

-రేపటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన -సమీప మున్సిపాలిటీల విలీనంతో ....



హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌ల పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. బుదవారం నుంచి ఐదేళ్ల కిందట కార్పొరేటర్‌లుగా ఎన్నికైన కార్పొరేటర్లు మాజీలుగా మారనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో 2016లో కార్పొరేటర్‌లుగా ఎన్నికైన వారు దాదాపు 80శాతం మంది మళ్లి కార్పొరేటర్‌లుగా ఎన్నికయ్యారు. 2020 డిసెంబర్‌లో జరిగిన కార్పొరేటర్ ఎన్నికలలో బీఆర్ఎస్ 56, బీజేపీ 48, ఎంఐఎంకు 44 సీట్లు రాగా కాంగ్రెస్‌కు కేవలం రెండు స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. అయితే 2016 జరిగిన జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీకాలం 2021 ఫిబ్రవరి 10 వరకు ఉండడంతో ఎన్నికలు డిసెంబర్‌లో జరిగినప్పటికి రెండవసారి ఎన్నికైన వారు ఫిబ్రవరి 11వరకు వేచి ఉండి ప్రమాణస్వీకారం చేశారు. ఎంఐఎం మద్దతుతో బీఆర్ఎస్ అభ్యర్థి గద్వాల్ విజయలక్ష్మి మేయర్, మోతె శ్రీలతారెడ్డి డిప్యూటీ మేయర్ ఎన్నికయ్యారు. అటు తరువాత అనేక రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, మేయర్, డిప్యూటీ మేయర్ తోపాటు పదిమంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే కొందరు కార్పొరేటర్‌లు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌కు మారారు. పార్టీల బలాబలాలు మారినా కొన్ని కారణాల వల్ల మేయర్‌గా, డిప్యూటీ మేయర్‌లుగా వారినే కొనసాగించారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు 150 డివిజన్‌లకు జరిగినప్పటికి ఇందులో 144 మంది మాత్రమే పూర్తి కాలంపాటు కొనసాగారు. ఆరు మందిలో మెహదిపట్నం కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ నాంపల్లి ఎమ్మెల్యే, రమ్నాస్‌పురా కార్పొరేటర్ మహ్మద్ ముబిన్ బహదూర్‌పు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. గుడిమల్కాపూర్, సంతోష్‌నగర్, ఎర్రగడ్డ, చంపాపేట్ కార్పొరేటర్‌లు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయా డివిజన్‌లకు ఉప ఎన్నికలు జరుపలేదు.

ఇచ్చిన హామీలు గాలికి వదిలి...

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యం అనేలా కొందరు కార్పొరేటర్‌లు వ్యవహరించారు. ఎక్కువ శాతం కార్పొరేటర్‌లు కేవలం సొంత ప్రయోజనాలే ప్రధానంగా భావించినట్లుగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది కార్పొరేటర్‌లు మాత్రం ఇచ్చిన హామీలకు కట్టుబడి అభివృద్ధి జరుపడం కోసం అనేక తిప్పలు పడ్డారు. జరగాల్సిన అభివృద్ధి జరుగకపోవడం, చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా అధికారుల చుట్టు తిరగాల్సి వచ్చింది. అభివృద్ధి పనుల్లో పర్సంటేజీల నుంచి భవనాల వద్ద వసూళ్ల వరకు జోరుగా అక్రమార్జనకు పాల్పడ్డారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులూ వారికి సహకరించారు. అడిగినంత ఇవ్వని వారి భవనాలపై చర్యలకు కొందరు కార్పొరేటర్లు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. కొందరు స్వయంగా ఫిర్యాదు చేయగా.. ఇంకొందరు అనుచరులను పురమాయించారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ముందు అప్పుల్లో మునిగిన వారు కూడా నేడు సొంత భవనాలు, ఫాం హౌస్‌లు, ఎస్‌యూవీ కార్లు, కుటుంబంలోని ఒక్కొక్కరికి ఒక కారు సంపాదించుకున్నారు. కొందరు బార్‌లు, వైన్‌షాపులలో పెట్టుబడులు పెట్టారు. బస్తీలలో అరాచకాలు చేసేవారికి కార్పొరేటర్‌లు అండగా నిలిచారు. కేవలం పైసా వసూల్‌లకే పరిమితమై కార్పొరేటర్ పదవీ కాలాన్ని ముగిస్తున్నారు. రౌడీలు, గుండాలు, సెటిల్‌మెంట్‌లు చేసేవారికి కార్పొరేటర్‌లు వత్తాసు పలికారనే ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేటర్‌లు అంటేనే వణుకు పుట్టేలా చేశారని జనాలు కూడా మండిపడుతున్నారు. బిల్డర్‌ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని చెప్పుకుంటున్నారు. రానున్న ఎన్నికల ఖర్చుకు డబ్బులు సిద్ధం చేసుకోవాలని చెబుతూ వసూళ్ల పర్వాన్ని పరాకాష్టకు చేర్చారన్న ఆరోపణలున్నాయి. అంతే కాకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా పోటీ చేయడం కోసం సంపాదనే లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి.

జీహెచ్ఎంసీ విభజన...?

జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలక మండలి గడువు మంగళవారం తో ముగుస్తుంది. ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్‌లో 150 డివిజన్‌లు ఉండగా తాజాగా వాటిని 300 డివిజన్‌లకు పెంచారు. డివిజన్‌ల పరిధులు మారిపోయాయి. జీహెచ్ఎంసీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా విభజించిన విషయం తెలిసిందే. అధికారుల పరిపాలనా సౌలభ్యం కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు కార్పొరేషన్‌లుగా విభజిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన మ్యాపింగ్ కూడా పూర్తి చేశారు. పాలకమండలి ఉన్న సమ యంలో విభజిస్తే సాంకేతిక, చట్టపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశ ముంది. అందుకే 10వ తేదీ తర్వాత విభజనపై అధికారికంగా నిర్ణయం తీసుకోవాలని సర్కారు నిర్ణయించినట్టు అనధికారికంగానే తెలుస్తోంది. 2,053 చరదవు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న జీహెచ్ఎంసీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా విభజించి కార్పొరేటర్‌ల పదవీ కాలం ముగియడం కోసం వేచి ఉంది. దాదాపు 1.34 కోట్ల జనాభాకు మెరుగైన పౌర సేవలందించేందుకు కార్పొరేషన్లు విభజించాలని నిర్ణయించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 7 కార్పొరే షన్లు, 20 మునిసిపాలిటీలను విలీనం చేస్తూ గత ఏడాది డిసెంబరు 3న ప్రభుత్వం మెగా జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం జీహెచ్ఎంసీని 6 జోన్లుగా ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, గోల్కొండ, శంషాబాద్,రాజేంద్రనగర్‌లుగా, జీసీఎంసీ (సైబరాబాద్) శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌లు కిలిపి మూడు జోన్లు, జీఎంఎంసీ (మల్కాజ్‌గిరి) మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్‌బీనగర్‌లో కలిపి మూడు జోన్లుగా విభజించనున్నట్లు సమాచారం.

స్పెషల్ ఆఫీసర్‌ల పాలన...

మంగళవారంతో పాలకమండలి పదవీ కాలం ముగియనుంది. ఇప్పటి వరకు కార్పొరేటర్ పర్యవేక్షణలో జరిగిన అభివృద్ధి, సమస్యల పరిష్కారం బుదవారం నుంచి స్పెషల్ ఆఫీసర్‌ల పాలనలో జరుగనున్నాయి. పాలక మండలి ఎన్నికలు జరిగే వరకు అధికారుల పాలన సాగనుంది. 2014 మార్చి నుంచి 2016 ఫిబ్రవరి వరకు స్పెషల్ ఆఫీసర్‌ల పాలన కొనసాగింది. పదేళ్ల తర్వాత ప్రత్యేకాధికారుల పాలన రానుంది.

హైదరాబాద్ వార్త

రోగులకు తప్పని తిప్పలు

రోగ నిర్ధారణ పరీక్షలు గగణమే ఆస్పత్రుల చుట్టు తిరుగుతున్న రోగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన స్పత్రులైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిన ఉస్మానియా లాంటి ఆస్పత్రులలో రోజురోజుకు రోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఇందకు తగ్గట్టుగా మాత్రం సదుపాయాలు మెరుగుపడడం లేదు. గత కొంత కాలంగా ఈ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం వచ్చే రోగులకు వైద్యులు వైద్య సేవలను విస్తరించాలని ప్రయత్నించినప్పటికి అందుకు అవసరమైన మేరకు వైద్య పరికరాలు అందుబాటులో ఉండడం లేదని తెలుస్తోంది. వాతావరణ మార్పులతో వచ్చే రోగాలతో పాటు ఇతర రోగాలకు వైద్యసేవలు అందించగలిగే ఆస్పత్రులైన సికింద్రాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులలో చికిత్సలకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేని కారణంగా సకాలంలో వైద్య సేవలను అందించలేకపోతున్నారు. అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు లేనప్పటికి ఆస్పత్రిలో ఉన్న వైద్యులతోనే కాలం నెట్టుకువస్తున్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో దాదాపు 11వందల పడకలు ఉండగా రోగుల సంఖ్య మాత్రం రెండువేలకు మించి ఉంటోంది. మరికొన్ని పడకలు అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికి సరైన వైద్యులు అందుబాటులో లేని కారణంగా అలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

రోగ నిర్ధారణ పరీక్షలకు తప్పని తిప్పలు

రోగికి చికిత్సలు చేయాలంటే అంతకంగే ముందుగా వైద్య పరీక్షలు జరిపించడం అవసరం. రోగిని వైద్యులు పరిక్షించిన అనంతరం వారికి సరైన చికిత్స అందించడం కోసం వైద్యులు రోగాలను నిర్ధారించుకోడాని ఎక్స్‌రేలు అంతకంటే ముఖ్యమైన పరీక్షలు జరిపించుకోవాల్సిందిగా సూచిస్తుంటారు. గాంధీ ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రాలు కూడా సరిపడా లేకపోవడంతో తీసిన ఎక్స్‌రేలను ఫోన్‌లలో ఫోటోలు తీసుకువచ్చి రోగులే వైద్యులకు చూపించి వైద్య సేవలు పొందుతున్నారు. కనీసం సిటీస్కాన్ చేయాలన్నా నాలుగైదు రోజుల సమయం పడుతుందని రోగులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితిలో వచ్చిన రోగికి రోగ నిర్ధారణ పరీక్షలు జరిపించుకోవాలంటే ప్రాణాల మిదికి వచ్చినంత పనవుతుందని రోగులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఓ రోగికి అత్యవసరంగా సిటీస్కాన్ చేయాల్సి ఉండగా టెక్నీషియన్ రోజుల తరబడి సమయం తీసుకుంటుండడంతో రోగి బంధువులు ఆందోళనకు దిగారు. అత్యవసర పరిస్థితిలో రోగ నిర్ధారణ పరీక్షలకు రోజుల సమయం తీసుకోవడం పట్ల మండిపడ్డారు. ఈ విషయంలో సూపరింటెండెంట్ కల్పించుకొని అప్పటికప్పుడు సిటీస్కాన్ చేయించడంతో సమస్య పరిష్కారం అయ్యిది. ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. నిత్యం రెండు వేల మంది రోగులు ఆశ్రహిస్తున్న ఆస్పత్రిలో సరైన వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులకు తిప్పలు తప్పడం లేదు. కొన్నిసార్లు రోగులు కూడా వైద్యులపై మండిపడుతున్నారు. రోగికి సంబంధించిన రిపోర్టులు సకాలంలో రాకపోవడంతో వైద్యులు కూడా చికిత్సలు జరిపే అవకాశం ఉండకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేకపోయినా సమస్యలు ఎదుర్కొంటున్నారు. చివరికి గాంధీ ఆస్పత్రి మార్చూరీలో ఫ్రీజర్‌లు కూడా అన్ని సక్రమంగా పనిచయడం లేదు. వాటిని గాంధీ ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పుడు ఉన్నవే తప్ప మళ్ళి కొత్తవి ఏర్పాటు చేయడం లేదని చెబుతున్నారు. దాదాపు 70 ఫ్రీజర్‌లు ఉండగా వాటిలో సగం కంటే ఎక్కువే పని చేయడం లేదని తెలుస్తోంది. ఆస్పత్రి వర్గాలు ప్రభుత్వానికి వీటి విషయమై లేక రాయగా వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఈ విషయమై సూపరింటెండెంట్‌ను ఆరా తీశారు. వెంటనే (టీజీఎంఎస్ఐడీసీ) తెలంగాణ వైద్యవిద్యా మౌళిక సదుపాయాల కల్పన సంస్థ ఫ్రీజర్‌ల మంజూరుకు అనుమతించింది. దీంతో త్వరలోనే దాదాపు 40 ఫ్రీజర్‌లు కొత్తవి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ఇలా అత్యవసరమైతే తప్ప అస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మిషనరీ అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రోగులు ఆస్పత్రికి వస్తున్నారు, పోతున్నారు. కాని ఆస్పత్రిని ఆశ్రహించిన రోగులక సమస్యలు మాత్రం అంతంమాత్రంగా పరిష్కారం అవుతున్నాయని రోగులు చెబుతున్నారు.

సిఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

సీఎం కప్ 2025 సెకండ్ ఎడిషన్‌ను కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు.సీఎం కప్-2025 రెండో ఎడిషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను జింఖానా గ్రౌండ్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధాకర్‌లతో కలసి జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు సార్లు కూడా సీఎం కప్ పోటీల్లో హైదరాబాద్ జిల్లా అత్యుత్తమ ప్రతిభ చూపి విజయం సాధించిందని గుర్తు చేశారు. ఈసారి కూడా అదే స్థాయిలో ప్రతిభను కనబరిచి, శ్రమతో పాటు నిబద్ధతతో పోటీల్లో పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈనెల 9నుండి 12వ తేదీ వరకు జింఖానా గ్రౌండ్‌తో పాటు వివిధ క్రీడా మైదానాల్లో క్రీడలను నిర్వహించడం జరుగుతుందని, పది వేల మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు గత క్రీడల్లో దాదాపు 183కి పైగా మెడల్స్ సాధించడం సాధించడం జరిగిందని ఈ పోటీలలో 43 క్రీడలు 16 మండలాల విద్యార్థులు పాల్గొనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే గెలుపు ఆత్మవిశ్వాసం సంతృప్తిని ఇస్తే, ఓటమి నిరాశకు దారి తీయకూడదని అన్నారు. ఓటమిని ఒక పాఠంగా తీసుకొని, తదుపరి పోటీల్లో మెరుగైన ప్రదర్శనకు ప్రేరణగా మార్చుకోవాలని క్రీడాకారులకు ఉత్సాహపరిచారు. క్రీడల ద్వారా క్రీడాస్ఫూర్తి, ఐక్యత, సహనం అలాగే క్రమశిక్షణ వంటి విలువలు అలవడతాయని, ఇవి జీవితంలోని ప్రతి దశలో ఉపయోగపడతాయన్నారు. గెలుపు, ఓటమి రెండూ సమానంగా తీసుకోవాలని అలాగే రెండూ వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులందరికీ విజయవంతమైన క్రీడాస్ఫూర్తితో కూడిన పోటీలు జరగాలని ఆకాంక్షించారు. క్రీడామైనదానాల్లో వాటర్, మెడికల్ శిబిరాలు అందుబాటులో ఉండాలని అలాగే క్రీడాకారులకు సమయానికి ఆహార పదార్థాలు అందించాలని కలెక్టర్ సూచించారు.అంతకుముందు కలెక్టర్ విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించి టాస్ ద్వారా క్రీడలను ప్రారంభించి, గొప్ప కార్యక్రమాన్ని చేపట్టుచున్నందున విద్యాశాఖ అధికారులను, క్రీడల శాఖ అధికారులను ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో తాశీల్దార్ పాండు నాయక్, డిప్యూటీ డిఇఓ పరమేశ్వరమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీదేవి, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిఈటిలు, వివిధ క్రీడా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్-2025 జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థుల గౌరవ వందతనం స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద జరిగిన 2వ తెలుగు సాహిత్య మహాసభ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు

పతంగి కోసం వెళ్లి బాలుడి మృతి

-కుటుంబంలో నింపిన విషాదం

అత్తాపూర్ ఫిబ్రవరి9, ప్రభాతవార్త : పతంగి కోసం వెళ్లి ఓ బాలుడి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న సంఘటన సంబంధించిన వివరాలు... మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన మహేందర్ ,సుజాత దంపతులు కుమారుడు హేమంత్ (10) కలిసి సాయిబాబానగర్‌లో ఉంటున్నారు.సోమవారం బాలుడు ఆడుకుంటూ పతంగి కోసం వెళ్లాడు. ఈ క్రమంలో ఓ కంపెనీ షెడ్డుపైకి ఎక్కిన బాలుడు ఒక్కసారి కింద పడి పోయాడు.దింతో బాలుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20.కోట్ల విలువ చేసే పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

- పార్కు చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్‌ను తొలగించిన అధికారులు

నార్సింగిలో 1600.గజాల పార్కు స్థలం చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్‌ను జేసీబీలతో తొలగిస్తున్న హైడ్రా అధికారులు.

నార్సింగి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : గండిపేట మండలం నార్సింగిలో రూ.20.కోట్ల విలువ చేసే 1600.గజాల పార్కు స్థలంను హైడ్రా అధికారులు కాపా డారు. నార్సింగి సర్వే నెంబర్లు 300, 303, 306, 311, 313, 315.లలో అరుణోదయ హౌసింగ్ సొసైటీ హుడా అనుమతితో లేఔట్ చేసింది. ఇందులో పార్కులు, కమ్యూనిటీహాళ్లకు స్థలంను వదిలిపెట్టారు. పార్కు కోసం కేటాయించిన 1600.గజాల స్థలం చుట్టూ నార్సింగికే చెందిన ఓ నాయకుడు రేకుల షెడ్డు వేసి కబ్జాకు యత్నించాడు. స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు రంగంలోకి దిగి పార్కు స్థలమేనని తేలిన తరువాత జేసీబీలు పెట్టి సోమవారం ఉదయం పార్కు చుట్టూ ఉన్న రేకుల షెడ్డును తొలగించారు. అక్కడ ఈ స్థలం పార్కుకు సంబంధించిందని, దీన్ని హైడ్రా కాపాడిందని బోర్డును ఏర్పాటు చేశారు. హైడ్రా అధికారుల తీరును స్థానికులు ప్రశంసిస్తున్నారు. పార్కులు, కమ్యూనిటీహాళ్లు, కుంటలు, చెరువులు, నాలాలను కబ్జా చేసిన వారిపై హైడ్రా కఠినంగా వ్యవహరిస్తుందంటూ స్థానికులు అభిప్రాయపడ్డారు.

వెంగళ్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తః వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరిగిన గొడవలో వెంగళ్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యతోపాటు ఇరువర్గాలపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 6న జవహర్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయం సమీపంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాలు ఘర్షణ పడుతున్నట్లు విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాఘవేందర్ గుర్తించారు. ఇరువర్గాలు గొడవపడటమే కాకుండా తిట్టుకుంటున్నట్లు ఆయన గమనించారు. సీవరేజీ పైపులైను ప్రారంభోత్సవం నేపథ్యంలో ఇరువర్గాలు చేతులతో కొట్టుకుంటూ స్థానికంగా ప్రశాంతతను చెదరగొట్టారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అక్కడి నుంచి పంపించారు. ఈ వ్యవహారంపై హెడ్ కానిస్టేబుల్ రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్‌కు చెందిన వెంగళ్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య, సత్యనారాయణ, ఇమ్రాన్, బబ్బులు అలియాస్ ముక్తార్ తదితరులతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన రూప, సత్యం యాదవ్, నర్సింగ్‌యాదవ్, నాగ యాదవ్ తదితరులపై 194(2) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే సతీమణి స్టోర్‌లో ఉద్యోగి చేతివాటం

- రూ. 2.43లక్షల చోరీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తః ఎమ్మెల్యే సతీమణికి చెందిన డిజైనర్ స్టోర్‌లో ఒక ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి నగదును తస్కరించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి కోడలు కుందూరు భవానీ అనుశ్రీ(కుందూరు జైవీర్ సతీమణి)కి చెందిన అనుశ్రీరెడ్డి స్టోర్ ఉంది. కాగా స్టోర్‌లోని లాకర్‌లో బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు పెట్టిన రూ. 2.43 లక్షల నగదు కనిపించలేదు. ఈ విషయాన్ని స్టోర్‌లోని సిబ్బంది గుర్తించారు. డబ్బు కనిపించని రోజు నుంచి స్టోర్‌లో హౌజ్ కీపింగ్ విభాగంలో పనిచేసే అమీనుల్ హుక్ విధులకు గైర్హాజరు కావడంతోపాటు సెల్‌ఫోన్ అందుబాటులో లేదు. దీంతో భవానీ అనుశ్రీ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఎత్తుకెళ్లిన దొంగలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తః చోరికి వచ్చిన అగంతకులు కారును చోరిచేసుకెళ్లిన సంఘటన మధురానగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకొంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డి గూడలోని సారథి స్టూడియో సమీపంలో ఎనుముల వెంకటరాంబాబు కార్యాలయం ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు అతని కార్యాలయంలోకి కిటికి గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించి కారు తాళాలు దొంగిలించారు. కార్యాలయం వద్ద ఉన్న ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు(టీఎస్ 07 ఈవీ 1789)ను ఎత్తుకెళ్లారు. జరిగిన సంఘటనపై వెంకటరాంబాబు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరికి గురైన కారు విలువ రూ. 5 లక్షల కుపైగా ఉంటుందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురైన బాలుడు

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : పతంగి కోసం వెళ్లి కరెంట్ షాక్ తగిలి ఓ బాలుడికి తీవ్రంగా గాయపడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీసే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి సమీపం ప్రగతినగర్‌కు చెందిన నర సింహ కుమారుడు రాహుల్ (6) ఆదివారం సాయంత్రం ఇంటి సమీపం లో ఆడుకుంటున్నాడు. గాలిపటం సమీపంలోని రక్షణలేని ట్రాన్స్ఫార్మర్‌కు చిక్కుకోవడంతో దాన్ని తీసుకునేందుకు వెళ్లి విద్యుత్ షాక్కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తగినంత ఎత్తు, సరైన కంచె లేని ట్రాన్స్ఫార్మర్ కావడంతోనే ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

: జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు సత్వరమే స్పందించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి అది. కారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్ఓ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఇదివరకు అం దిన ప్రజావాణి అర్జీల పురోగతిని శాఖల వారీగా ఆయన సమీక్షించారు. ప్రజా వాణిలో 466 ఆర్జీలు అందగా అందులో హౌసింగ్ శాఖ 331, ఇంది రమ్మ ఇండ్లు 322, పింఛను84, రెవెన్యూ 15,ఇతర శాఖలు 36 ఫిర్యాదులు వచ్చా యని ఆయన తెలిపారు. అలాగే వికలాంగుల, ఎయిడ్స్ ,లెప్రసీ బాధితుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలును సమీక్షించడానికి జాతీయ మా నవ హక్కుల కమిషన్ ఈ నెల తెలంగాణకు సందర్శించనున్నదని, ఇందులో భాగంగా జిల్లాలో 16వ తేదీన సమీక్షించనున్నారని తెలిపారు. కావున వాటి అమలుపై నివేదికలు, అలాగే సూచనలు సిద్ధంచేసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి. అశోక్ చక్రవర్తి, సిపిఓ డాక్ట ర్. సురేందర్,లా ఆఫీసర్ శ్రీదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. వెంక టి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు జి.ఆశన్న, కోటాజి, ప్రవీ ణ్, ఇలియాస్ అహ్మద్,జి.ఎం ఇంద్రస్ట్రీస్ పవణ్ కుమార్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి రాజేందర్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఎ.ఓ విజయ లక్ష్మీ , వివిధ శాఖల జిల్లా అధికారు లు, ఆర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలానా తప్పించుకోవడానికి.. వాహన డిక్కీలో నంబరు ప్లేటు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తః

డిక్కీలో నంబరు ప్లేటుతో ప్రయాణిస్తున్న వాహనదారుడిని ప్రశ్నిస్తున్న డీసీపీ కాజల్, చిత్రంలో ఏసీపీ కట్టా హరిప్రసాద్ తదితరులు

సుల్తాన్‌బజార్ పోలీసులకు ప్రశంసలు

ప్రశంసా పత్రాలతో ఇన్‌స్పెక్టర్ నరసింహా,డి.ఐ ధర్మారావు,ఎస్ సాయిరాం

గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 9ప్రభాతవార్త: శాంతి భద్రతలను కాపాడటంతోపాటు విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సుల్తాన్‌బజార్ పోలీసులకు నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ ప్రశంసా పత్రాలను అందచేశారు.పోలీసు కమాండో కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహ,డి.ఐ ధర్మారావు,ఎస్.ఐ సాయిరామ్‌లునగర పోలీసు కమిషనర్ వి.సి సజ్జన్నార్ చేతుల మీదుగా ఎక్స్ ట్రా మైల్,పురస్కారం,గుడ్‌వర్క్‌రివార్డులు అందుకున్నారు.ఈసందర్భంగా సుల్తాన్‌బజార్ స్టేషన్ పోలీసు సిబ్బందిని అభినందించారు.

బస్తీ సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఉపకరిస్తుందని జీహెచ్‌యంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నర్కి ఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్లో అక్రమ నిర్మాణంపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత విభాగాలచే పరిష్కరిస్తున్నామన్నారు. బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, ఏయంసీ రాజారావు, ఎలక్ట్రికల్ డిఈ సత్యనారాయణరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ భాను చందర్, సీనియర్ అసిస్టెంట్‌లు మహమ్మద్ హమీద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విరలేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే తలసాని



విరలేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని.

బేగంపేట ఫిభ్రవరి 9,ప్రభాతవార్త

ఎంతో పురాతన మైన విరలేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.ఆలయ నిర్వహకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే తలసాని రాంగోపాల్‌పేట డివిజన్ ఓల్డ్‌బోయిగూడా లోని విరలేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించారు.స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.పూజల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేని సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేసారు.ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టవల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు.ఎమ్మెల్యే వెంట మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్,అరుణాశ్రీనివాస్‌గౌడ్,బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,నాయకులు కిషోర్ ,రామ్మోహన్ ,నాగులు,కొండాపురం మహేష్‌యాదవ్,టీను గౌడ్,ఓదెల సత్యనారాయణ,చంద్ర ప్రకాష్, ఆలయ నిర్వహకులు నాగరాజు,శ్రీధర్,జయసూర్య ,అరుణ్ మహరాజ్ తదితరులు ఉన్నారు.

బాక్స్ డ్రైను పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మర్రి

బాక్స్ డ్రైను పనులు పారంభిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: బాక్స్ డ్రైన్‌లు ఏర్పాటు ద్వారా వరద ముంపు నుంచి శాస్వత పరిష్కారం లభిస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని దినకర్ నగర్‌లో 2.3 కోట్లు వ్యయంతో ఏర్పాటు చేయనున్న బాక్స్ డ్రైన్ పనులను స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వర్షాకాలం లోపు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలలో డిఇ ప్రశాంతి, ఎఇ అరుణ్ బిఆర్ఎస్ నేతలు ప్రేమ్ కుమార్, యాదగిరి గౌడ్, మహేష్, సాజిద్, సెల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు కార్పొరేటర్లు వినతి

అల్వాల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

తమ డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్‌కు చెం దిన ఇద్దరు కార్పొరేటర్లు జిహెచ్‌ఎంసిక మీషన్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనీల్ కిషోర్‌లు కమీషనర్ కర్ణన్‌ను కలిసి సమస్యలను వివరించారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కారానికి సహకరించాలని వారు కోరారు.

బోరబండలో గంజాయి స్వాధీనం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తః బోరబం డలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల తోపాటు వినియోగిస్తున్న మరొకరిపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. మోతినగర్ సారధి నగర్ సమీపంలో కొందరు గంజాయి సరఫరా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేయగా బోరబండ భరత్‌నగర్‌కు చెందిన గంజాయి సరఫరాదారుడు షేక్ సికిందర్(46), అతని కింద పనిచేసే మరో సరఫరాదారుడు కొల్లూరులోని డబుల్ బెడ్‌రూంలో నివసించే మహమ్మద్ ముదాస్సిర్ ఖాన్ అలియాస్ షన్ను(23)లతోపాటు వినియోగదారుడైన ఎన్ఆర్ఆర్‌పురంకు చెందిన సయ్యద్ అబ్దుల్ ఫాజిల్(23)లు పట్టుబడ్డారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 30 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ మాసంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : రానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పారిశుధ్య నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నర్కి ఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లు, పారిశుద్ధ్య విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రార్థనా మందిరాలు, జనసంవర్ధక ప్రాంతాలలో ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జోన్ పరిధిలోని ఐదు సర్కిల్లో 15 వాహనలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి వాహనంలో ముగ్గురు చొప్పున సిబ్బంది ప్రతిరోజు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంటూ నెల రోజుల పాటు పనిచేస్తారని తెలిపారు. బస్తీలలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

రంజాన్ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

నెల రోజుల పాటు జరిగి ఉపవాస దీక్షల సందర్భంగా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మలక్‌పేట్, సంతోష్ నగర్, యాకుత్‌పురా, చార్మినార్, మూసారంబాగ్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ఇంకేషఫ్ అలీ, మంగ తయారు, సుభాష్, సరిత, భాస్కర్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎం డీఈలు వెంకట్ రాజు, నవీన్ కుమార్, రంజిత్‌రెడ్డి, శ్రీరాములు, రాంకీ సంస్థ జోనల్ ఇంచార్జి నందకిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీ దేవాలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు..

బేగంపేట ఫిబ్రవరి 9,ప్రభాతవార్త

రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని ఆవుల మంద శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మ వారి దేవాలయోద్ధరణ, పున;ప్రతిష్టా మహా కుంభాభిషేక మహోత్సవాలను ఈ నెల 22 వతేదీ ప్రారంభమవుతాయని దేవాలయ కమిటీ స్పష్టం చేసింది.సోమవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవస్థానం సంఘం అధ్యక్షులు చందా బాలేందర్,దేవాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సోమా ఆనంద్‌కుమార్‌లు విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.22వ తేదీ ఉదయం గం 7.45లకు పూజలు మొదలవుతాయన్నారు.26న హంపి పీఠాధిపతి విధ్యారణ్య భారతి చేతులు మీదుగా ప్రాణ ప్రతిష్ట కళాన్యాసము,మహాకుంభాభిషేకము మొదలైన పూజలతో పున;ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందన్నారు.

వాస్తవాలకు దూరంగా ఆరోపణలు....

400ఏళ్ల చరిత్ర కలిగిన వాసవి కన్యాకాపరమేశ్వరిదేవి దేవాలయం పూర్తిగా శిధిలావస్థకు చేరి వర్షం నీరు దేవాలయం లోపల కురిసేవని,మురుగు నీరు గర్భగుడి వరకు వచ్చేవని చెప్పారు.2017లో ఎన్నికల ద్వారా ఎన్నికైన కమిటీ ఆలయాన్ని అభివృద్ధి చేస్తుందని నమ్మకంతో 2002లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి జీర్ణోద్దరణ కు పూనుకున్నామని చెప్పారు.దేవాలయ జీర్ణోద్దరణ ఇష్టంలేని కొందరు కమిటీకి దురుద్దేశాలను అంటగట్టి అమ్మవారి ఆలయ అభి

విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న చందా బాలేందర్,సోమా ఆనంద్‌కుమార్ తదితరులు.

వృద్ధిని అడ్డుకుంటున్నారని వారు ఖండించారు.రూ 4.48కోట్లు దేవాలయానికి విరాళాలు రాగా రూ 3.90కోట్లు ఖర్చు చేసామని చెప్పారు.మళ్లీ ఇంకో వెయ్యేళ్లు చెక్కు చెదరకుండా దేవాలయాన్ని నిర్మించామన్నారు. కన్యకాపరమేశ్వరీ దేవాలయానికి దేవదాయ శాఖ అనుమతులు అవసరం లేదని స్థపతి ఆమోదం తెలిపారు.అలాగే దేవాలయం నిర్మాణం అయ్యే ప్రాంతం లీజు ల్యాండు కాదని ఎస్టేట్ అధికారులు సికింద్రాబాద్ తహశీల్దార్ తేల్చి చెప్పారని తెలిపారు.దేవాలయంలో సభ్యులు కూడా కానీ వారు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న దేవాలయ అభివృద్ధిని అడ్డుకుంటూ అధికారులు,న్యాయస్థానాలను ఆశ్రయించడం పట్ల హిందువులందరూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్,కోశాధికారి ఎం.శరత్‌బాబుతో పాటు పలువురు వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవ ఆశయ సాధనే కళాకారులకు నిజమైన నివాళి : సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త) : ప్రముఖ న్యాయవాది, నాటక రంగ ప్రముఖులు బళ్లారి రాఘవ యాదిలో సభ త్యాగరాయ గానసభ వేదికగా ఎందరో మహానుభావులు మధుర స్మృతులు కార్యక్రమంలో తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సహకారంతో సోమవారం జరిగింది. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన నటన కేవలం వినోదం కోసమే కాకుండా సమాజ హితం కోసం సాగిందని కొనియాడారు. నేటి తరానికి ఆయన స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు జనార్ధన్ మూర్తి మాట్లాడుతూ బళ్లారి రాఘవ యాదిలో ప్రతి

ప్రసంగిస్తున్న శాసనసమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సభలో ప్రముఖ పాత్రికేయులు జయసూర్య, తెలంగాణ వికలాంగుల సంస్థ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్ తదితరులు పాల్గొని రాఘవ వ్యక్తిత్వాన్ని, రంగస్థల ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి గ్రీన్ సిగ్నల్

-జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరిన కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

చిక్కడపల్లి ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త) : గాంధీనగర్ డివిజన్ పరిధిలో మంజూరైన నిధులతో పూర్తయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ను కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్‌ను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కేటాయించిన రూ. 2 కోట్ల కార్పొరేటర్ నిధులలో ఇప్పటికే రూ. 1 కోటితో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, వాటిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మిగిలిన రూ. 1 కోటి నిధులను కూడా వెంటనే విడుదల చేసి, డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న ఇతర అభివృద్ధి పను

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్

లకు వెచ్చించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని, పెండింగ్ పనుల పూర్తికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు బంగారు పతకాలు ప్రధానం

అత్తాపూర్

ఫిబ్రవరి9,ప్రభాతవార్త : వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 56,57,58 సంయుక్త స్నాతకోత్సవంలో 64 మంది అండర్ గ్రాడ్యూయేట్స్ కి, 26 మంది పోస్ట్ గ్రాడ్యూయేట్స్ కి, ఆరుగురు పీ హెచ్ డీలకు బంగారు పతకాలను ఉపకులపతి ప్రొఫెసర్ అల్వాస్ జానయ్య,వ్యవసాయ నిపుణులు ప్రభు పింగళి అందజేశారు. 56 వ స్నాతకోత్సవానికి సంబంధించి బీ టెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) విద్యార్థిని గన్నేరపు నవ్య ఆరు బంగారు పతకాలు సాధించింది. అలాగే 58 వ స్నాతకోత్సవానికి సంబంధించి బీ టెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) విద్యార్థిని స్నేహలత ఏడు బంగారు పతకాలని సాధించింది. బీ ఎస్సీ(అగ్రికల్చర్) విద్యార్థిని మారం సంజన 5 బంగారు పతకాలు సాధించింది.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ తమ బిడ్డలతో పోటోలకు దిగారు.

యుపిఎస్‌సీ పరీక్షలు విజయవంతంగా పూర్తి

:జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

యుపిఎస్‌సీ పరీక్షలు విజయవంతంగా పూర్తి అయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అన్నారు.సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఆదివారం జరిగిన యుపిఎస్‌సీ ఇంజనీరింగ్ సర్వీసెస్, అలాగే కంబైన్డ్ జియో సైంటిస్ట్ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ సూపర్వైసర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్లు అలాగే లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో డీ బ్రీఫింగ్ సమావేశంలో పాల్గొని సమీక్షించారు. పరీక్షలలో అభ్యర్థులకు ఏ ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులను అభినందించారు.రాబోయే పరీక్షలలో కూడా అందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సహకరించాలని సూచించారు. అభ్యర్థులకు పరీక్షా ప్రక్రియ సులభతరం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని కేంద్రాల నియమించిన వెన్యూ సూపర్వైజర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్లు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్ 2లో పటాన్‌చెరువు నుండి హైదర్ నగర్ వరకు, కలబ్ గూర్ నుంచి పటాన్‌చెరువు వరకు ఉన్న 1500 ఎంఎం డయా పిఎస్‌సి పంపింగ్ మెయిన్‌కు వివిధ ప్రాంతాల్లో భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు ఈనెల 11వ తేది బుధవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 12 తేది గురువారం రాత్రి 10 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ 40 గంటలు పలు ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:

ఓ అండ్ ఎం డివిజన్ 17: ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, ఓ అండ్ ఎం డివిజన్ 22: బీరంగూడ, అమీన్ పూర్, భాగ్యనగర్ కాలనీ. ట్రాన్స్ మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు. ఓ అండ్ ఎం డివిజన్ 6: ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్. ఓ అండ్ ఎం డివిజన్ 9: కెపిహెచ్‌బి కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ ప్రగతి నగర్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

11వ తేదీన మాజీ సైనికుల సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త

మాజీసైనికుల సమస్యల పరిష్కారానికి ఆర్మీ నుండి కొందరు అధికారులు సోమాజీగూడా లోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి ఈ నెల 11వ తేదీన ఉదయం 11గంటలకు విచ్చేయనున్నారు. ఎవరైనా మాజీసైనికులు పెన్షన్ సమస్యలు, ఇతర సమస్యలు ఉన్నట్లయితే వారు సోమాజీగూడాలోని ప్రాంతీ య సైనిక సంక్షేమ కార్యాలయానికి హాజరై వారి సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి కోరారు.

అంబర్‌పేటలో నాణ్యతతో సిసి రోడ్డు పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త

అంబర్‌పేట నియోజకవర్గంలో చేపడుతున్న సిసి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు బాధ్యత వహించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట్ డివిజన్ ప్రేమ్‌నగర్ చౌరస్తా రోడ్డు లైన్‌లో రూ.80 లక్షలతో సిసి రోడ్డు పనులు, బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున్ నగర్‌లో రూ.30 లక్షలు, తురాబ్‌నగర్‌లో రూ.10 లక్షలు, భరత్‌నగర్‌లో రూ10 లక్షలతో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డిలు పాల్గొని పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే సిసి రోడ్డు ప్రారంభోత్సవ బస్తీలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ...అభివృద్ధి పనుల పట్ల అధికారులు పర్యవేక్షణ అవసరమని,అధికారుల నిరక్ష్యం తగదన్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో నిర్మాణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డు తవ్వి వదిలేయకుండా సకాలంలో సిసి రోడ్డు పనులు చేపట్టి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలీ కేఫ్ దుర్గ నగర్,ప్రేమ్ నగర్ లో పర్యటించి స్థానికంగా ఉన్నటువంటి డ్రైనేజీ సమస్యలను,మరియు విధి దీపాల సమస్యలను, విద్యుత్ పోల్ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడుతూ స్థానికంగా వీధిదీపాల సమస్య,పాడైపోయిన విద్యుత్ స్తంభాలను, డ్రైనేజీ సమస్యల

పటేల్‌నగర్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు

ను త్వరితగతిన పరిష్కరించాలని, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఈ ప్రవీణ్, ఏఈ పవన్, ఏఈ ప్రదీప్ కుమార్,వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ మరియు బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పెట్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్,పార్టీ సీనియర్ నాయకులు, లవంగం ఆంజనేయులు, లింగారావు, రామారావు యాదవ్, మల్లేష్ యాదవ్, రంగు సతీష్ గౌడ్,మహేష్ ముదిరాజ్, మల్లికార్జున్ యాదవ్,జాకీ బాబు,పాక సంతోష్,రఫిక్, నాయకులు,బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్,ప్రముఖ న్యాయవాది నర్సింగ్, మిర్యాల శ్రీనివాస్, రవీందర్,అంబర్ పేట్ డివిజన్ అధ్యక్షుడు సిదార్థ ముదిరాజ్, ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్, సీనియర్ నాయకులు ఉంగరాల మల్లేష్ యాదవ్, స్థానిక బస్తీ వాసులు, జిహెచ్‌ఎంసి,జలమండలి అధికారులు పాల్గొన్నారు.

భక్తిపారవశ్యంలో వినాయక విజయం హరికథా గానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: ప్రముఖ హరికథా విద్వాంసురాలు భగవతారిణి వెంకటనాగసింధు అందించిన వినాయక విజయం హరికథా గానం ప్రేక్షకులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. వినాయకుడి జననం, గజాసుర సంహారం మరియు విఘ్నేశ్వరుడిగా ఆయన పొందిన కీర్తిని హరికథ భగవతారిణి వెంకట నాగసింధు (ప్రొద్దుటూరు) తన గాత్రంతో, అద్భుతమైన కథా ప్రవచనంతో కళ్లకు కట్టినట్లు మధుర గాన నటన నాట్య మిళితంగా చెప్పి ఆకట్టుకున్నారు. సోమవారం నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని 'హరికథా మహోత్సవాల'లో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ బి. భవాని ప్రసాద్ హాజరై ప్రసంగించారు. వేదిక పై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి.రమణాచారి, జాయింట్ మెట్రో

హరికథాగానం చేస్తున్న హరికథ భగవతారిణి వెంకట నాగసింధు

పాలిటన్ కమీషనర్ శ్రీవత్స కోట, కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత దాసరి వెంకట రమణ కిన్నెర సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, వెంకట రావు, రాధాకృష్ణ, సతీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. హరికథాగానానికి వయోలిన్‌పై ధూళిపాల శ్రీనివాసమూర్తి, మృదంగంఎపై రాయప్రోలు సుధాకర్ వాద్యసహకారాన్ని అందించారు.

వైద్య శిబిరాలు సమాజ సేవకు దోహదం

ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేందర్,అధ్యక్షులు అశోక్‌సింగ్,కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌లు

**అప్జల్‌గంజ్,ఫిబ

కార్మికులను బెదిరిస్తున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి

-పౌర హక్కుల ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింద్యాల

సమావేశంలో మాట్లాడుతున్న జయవింద్యాల

సైఫాబాద్ ఫిబ్రవరి9,ప్రభాతవార్త : గత మూడు సంవత్సరాల నుంచి పనులు చేయించుకుంటూ డబ్బులు అడిగితే చంపేస్తామని ఓ బిల్డర్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని వలస కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో నాగర్ కర్నూలు జిల్లా తెలకపల్లి మండలంకు చెందిన వలస కార్మికులు భర్యభర్తలు అనుష, రామస్వామిలతో కలిసి పౌర హక్కుల ప్రజా సంఘం (పీయుసీఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవింద్యాల సమావేశంలో మాట్లాడారు...మూడు నెలల క్రితం మోహిదీపట్నంలోని విజయనగర్ కాలనీలో మహ్మద్ ఫారుఖ్ అనే బిల్లర్ వద్ద కూలీ 26 మంది కూలీలతో భర్యభర్తలు అనుష,రామస్వామి పనులు చూయడం జరిగిందని అడ్వాన్స్‌గా 5 లక్షల రూపాయలు ఇచ్చి పనులు పూర్తయిన తర్వాత రూపాయలు 30 లక్షల ఇస్తామని బిల్డర్ హామీ ఇచ్చాడు. పనులు పూర్తి అయ్యాక డబ్బులు అడిగితే బిల్డర్ చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయారు. బిల్టర్ మహ్మద్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బిల్డర్ కార్మికులను మోసం చేస్తున్న కార్మిక శాఖ పట్టించుకోకపోవడం బాధకరమన్నారు.బాధితులకు న్యాయం జరిగేంతా వరకు పోరాటం చేస్తామన్నామని హెచ్చరించారు.

న్యాయవాదుల రక్షణ చట్టం కోసం పోరాడదాం

తెలంగాణ న్యాయవాదుల పిలుపు

అడ్వకేట్ స్వప్న సంతాపసభలో నివాళులర్పిస్తున్న తెలంగాణ న్యాయవాదులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త: న్యాయవాదుల రక్షణ చట్టం సాధించేవరకు పోరాడుదామని తెలంగాణ న్యాయవాదులు పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్లలో ఇటీవల హత్యకు గురైన అడ్వకేట్ స్వప్న సంతాపసభ బార్ అసోసియేషన్ ఆఫ్ చేవెళ్ల మరియు రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని, ఈ దాడులను అరికట్టాలంటే న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, న్యాయవాదుల రక్షణకై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.డి. శ్యాంసుద్దీన్, ఏ.అనంతసేన్ రెడ్డి, సునీల్‌గౌడ్, ఏ.మహేస్, గుర్వారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వై.కొండల్‌రెడ్డి, ఎన్.బస్వరాజ్, బి.కార్తీక్, రంగారెడ్డి జిల్లా, వికారాబాద్, షాదీనగర్, పరిగి బార్ అసోసియేషన్ నేతలు, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రామాలు చేయడం సరైంది కాదు : బద్రి యాదవ్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత బద్రినాథ్ యాదవ్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ ఓల్డ్ మారేడ్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపణీలో అవినీతి అక్రమాలకు ఆస్కారం లేకుండా స్థానికంగా నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు 2వ విడతలో 140 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు అలాట్ చేసేందుకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత సి.బద్రినాథ్ యాదవ్ తెలిపారు. మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పోరేటర్‌గా కొనసాగుతున్న కొంతం దీపిక తన పదవి ఒకే ఒక్క రోజులో అయిపోతుందన్న ఉద్దేశ్యంతో డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో డ్రామాలు చేస్తూ లబ్ధిదారులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తన 3 యేండ్ల పదవి కాలంలో డివిజన్‌లో ప్రజా సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. తన పదవి కాలం ముగుస్తుందన్న అక్కసుతో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు కొద్ది రోజుల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఫ్లాట్ల కెటాయింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.డి.నాగేశ్ యాదవ్,కాంగ్రెస్ నాయకులు పి.నర్సింగ్ రావ్, సాల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

1వ వార్డు అభివృద్ధికి కృషి : జంపన

1వ వార్డు పెద్దతోకట్టలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తెచ్చి త్వరిత గతిన పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. 1వ వార్డు పెద్దతోకట్టలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలోని జైరామ్ వ్యాయామ శాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కోటాలో 20 లక్షలు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. నూతన భవన నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ శాల కమిటీ అధ్యక్షులు డి.రాజు యాదవ్, ప్రతినిధులు పోతరాజు, సాయి, గిరి గౌడ్,దామోదర్ గౌడ్,ప్రదీప్ రెడ్డి,గౌతమ్,తేజ,పుష్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

11 కెవి శ్రీ హోమ్స్ ఫీడర్‌లో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు శ్రీ హోమ్స్ కాలనీ, ఎఎస్ఆర్ బృందావన్ కాలనీ, కెఆర్సిఆర్ కాలనీ, హిరిసే విల్లాస్, అలాగే 11 కెవి క్రాంతి నగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్రాంతి నగర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ ఎ.శశిధర్ తెలియజేశారు.

కమ్యూనిటీ హాల్ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం

ముషీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడ డివిజన్, దోమలగూడలోని మున్సిపల్ క్వార్టర్స్‌లో పురాతన కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణానికై, నూతన భవన నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పోరేటర్ రచనశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రచనశ్రీ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధుల క్రింద 22.5 లక్షల వ్యయంతో గ్రౌండ్ మరియు మొదటి అంతస్థుతో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు శంఖుస్థాపన చేశామని తెలిపారు. మున్సిపల్ క్వార్టర్స్‌లో చిన్న గదిలో అంగన్‌వాడి కేంద్రం కొనసాగేదని, బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన స్పందించి, నిధులు మంజూరు చేయించటం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా కవాడిగూడలోని కొత్త బజార్ నుంచి రాక్ చర్చి వరకు డ్రైనేజి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎంపీ నిధుల ద్వారా దాదాపు 70 లక్షల రూపాయలతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన డ్రైనేజి పైప్‌లైన్ పనులను ప్రారంభించామని, అవి కూడా తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు శాంతి కుమార్, బీజేపీ నాయకులు ఎం.సి.మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యాం

కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ తదితరులు

యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎన్.డి.సాయికృష్ణ, బీఆర్ఎస్ నేతలు ప్రభాకర్, రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాగుల సాగర్, శ్రీహరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన నేతాజీ క్రికెట్ టీంను సత్కరించిన కార్పోరేటర్

ప్రధాన మంత్రి ఖేల్ మహోత్సవ్ క్రీడల్లో భాగంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలలో ఫైనల్‌కు చేరిన కవాడిగూడ హుందా బాగ్‌కు చెందిన నేతాజీ క్రికెట్ టీంను కార్పోరేటర్ రచనశ్రీ శాలువాతో సత్కరించారు. కెప్టెన్ రాజుతో పాటు క్రీడాకారులను ఆమె అభినందిస్తూ ఫైనల్‌లో కూడా విజయం సాధించి, టోర్నమెంట్ కప్పు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మహిళ భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తా : పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

పాపిరెడ్డి నగర్ కాలనీ మహిళ భవన నిర్మాణానికి ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కూకట్పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో మహిళ భవనం నిర్మాణం కొరకు పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో (ఎస్‌డిఎఫ్ నిధులతో) నిర్మించడానికి గాను నిధుల మంజూరి కొరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి పంపిన మంజూరి పత్రాలను కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి మహిళ సోదరీమణులకు చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ పాపిరెడ్డి నగర్ కాలనీలో అభివృద్ధిలో భాగంగా మహిళ సోదరీమణుల విజ్ఞప్తి మేరకు కాలనీలో మహిళ భవనం నిర్మాణము కొరకు పది లక్షల రూపాయల ఎమ్మెల్యే నిధులు మంజూరు కాగానే మహిళ

భవనంను త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,మహిళ సోదరీమణులు చిన్న చిన్న సమావేశాలు, సభలు,ఫంక్షన్‌లు నిర్వహించుకునేందుకు వీలుగా మహిళ భవనం ను నిర్మించేందుకు సంతోషంగా ఉందన్నారు. కూకట్‌పల్లి డివిజన్ నియోజకవర్గ అభివృద్ధికి శాయ షెక్తుల కృషి చేస్తానని చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పద్మావతి, శోభారాణి, పద్మ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి

కొంపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్-56 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం ఆరు వినతిపత్రాలు స్వీకరించబడగా, వాటిని సంబంధిత శాఖ అధికారులకు వెంటనే పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం, వీధి దీపాలు, ఆస్తి పన్ను తదితర సమస్యలను అధికారులు గమనించాలని సూచించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ కమిషనర్ ఈ సందర్భంగా కోరారు

వినతుల స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి

దాసారం బస్తీ అధ్యక్షుడిగా పోతురాజు కుమార్



బీఆర్ఎస్ అమీర్‌పేట్ డివిజన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం.

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోతురాజు కుమార్ నూతనంగా దాసారం బస్తి అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు ఎం. హనుమంతరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు పోతురాజు కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీఆర్ఎస్ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.ఆర్. నారాయణ రాజు గౌడ్, వనం శ్రీనివాస్, మల్లన్న గౌడ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

ధృష్టి మళ్లించి మోసాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: పూజలు చేస్తామనే నెపంతో దృష్టి మళ్లించి మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి 5గ్రాముల ఒక బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... జామియాఉస్మానియా రైల్వేస్టేషన్ సమీపంలోని లలితానగర్‌లో నివాసం ఉండే రిటైర్డ్ అధికారి. వెనిగళ్ళ రవి (62) వద్దకు మధ్యప్రదేశ్‌కు చెందిన జల్పల్లి, పహాడీషరీఫ్‌లో నివాసం ఉండే సుభాష్ నాథ్ (23), కరణ్ నాథ్ (21), సోహన్ నాథ్ (23) భిక్షాటకులైన ముగ్గురిలో ఇద్దరు వచ్చి పూజలు చేస్తామని నమ్మించి ఆయన వద్ద ఉన్న అర తులం బంగారు ఉంగరాన్ని తీసుకున్నారు. ఆ ఉంగరాన్ని మింగేసి, సమీపంలో ఆటోతో సిద్ధంగా ఉన్న మరో నిందితుడితో కలిసి వారు పారిపోయారు. కేసు నమోదు చేసుకున్న వారాసిగూడ పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులను అరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితులు బ్రతుకు తెరువు కోసం నగరారి వచ్చినట్లుగా గుర్తించారు. చిలకల గూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ జి. రాజేందర్ గౌడ్ తన సిబ్బందితో దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకున్నారు.

ఘనంగా స్కూల్ మూడవ వార్షికోత్సవ వేడుకలు

రవికుమార్ లావణ్యలకు మెమెంటో అందజేస్తున్న పురంధర్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెస్ట్ సాయి నగర్లోగల మహా బోధి ఫ్రీ స్కూల్ మూడవ సంవత్సర వార్షికోత్సవం వివేకానంద నగర్ అపార్ట్మెంట్స్ కమ్యూనిటీ హాల్లో డైరెక్టర్ గుండడి రవీందర్ కుమార్ ప్రిన్సిపల్ లావణ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి, వెస్ట్ సాయి నగర్ అధ్యక్షులు జి ప్రభాకర్, ఫౌండర్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు దశమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురంధర్ రెడ్డి మాట్లాడుతూ మహా బోధి ప్రీ స్కూలు ఫౌండర్ రవికుమార్ ప్రిన్సిపల్ లావణ్య ఆధ్వర్యంలో చిన్నారి పిల్లలకు విద్య బోధించడం పిల్లలకు ఆటపాటలతో క్రీడలతో చిన్నారులు ఉత్సాహంగా ఉండటానికి టీచర్స్ ఎంతో జాగ్రత్తగా పిల్లలను చూసుకొని విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా ప్రీ స్కూల్లో మంచిగా పునాది పటిష్టంగా ఉంచడానికి స్కూల్ యజమాన్యం టీచర్స్ ఎంతో శ్రద్ధతో పిల్లలకు మంచి గుణగణాలతో ముందుకు తీసుకెళ్తూ శ్రద్ధతో చూసుకుంటున్నారని స్కూలు యజమాన్యానికి టీచర్లకు చిన్నారులకు వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

ఇంటర్ విద్యార్థిని మృతికి కారణమైన లెక్చరర్ సస్పెండ్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జి.వర్షిని గత నెల 9వ తేదీన మృతి చెందింది. ఆమె మృతికి కాలేజీలోని ఫిజిక్స్ లెక్చరర్ ఎన్.వై.శ్రీలక్ష్మి,ఇంగ్లీషు లెక్చర్ మధుర హిమ బింధుల వేధింపులతో బ్రేన్ స్ట్రోక్‌తో మృతి చెందిందని ఆ బాలిక తల్లిదండ్రులు, విద్యార్థులు,దళిత సంఘాలు డిమాండ్ చేస్తూ గత నెల 9న మారేడ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డిఐఓ) ఒడ్డెన్న, గత నెల 19న విచారణ జరిపారు. వరంగల్ ఆర్‌జేడీ ఐఈ ఏ.గోపాల్ ఈ నెల 7వ తేదీన లెక్చరర్ శ్రీలక్ష్మిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

సనత్‌నగర్ అభివృద్ధి ఘనత మాదే : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త: సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో రహదారుల అభివృద్ధి ఘనత తమకే దక్కుతుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం సనత్‌నగర్ డివిజన్‌లో మూడు ప్రాంతాల్లో రూ.1 కోటి 68 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. రవీంద్ర నగర్ పార్క్ వద్ద రూ.16 లక్షలు, నెహ్రూ నగర్ పార్క్ వద్ద రూ.75 లక్షలు, సనత్‌నగర్ బస్టాండ్ వద్ద రూ.77 లక్షల వ్యయంతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నెహ్రూ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి మందుల లభ్యత, రోజూ చికిత్స పొందుతున్న రోగుల సంఖ్యపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ 2014కు ముందు నియోజకవర్గంలో రహదారులు దారుణ స్థితిలో ఉండేవని, మురుగు నీటి ప్రవాహంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.900 కోట్లతో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మెయిన్ రోడ్లు, కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి చేశామని చెప్పారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ముందు ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో కనకదుర్గమ్మ ఆలయం నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు విశాలమైన రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఫతేనగర్ ఫ్లైఓవర్ నుంచి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ వరకు రోడ్డు విస్తరణ పనులు తమ హయాంలోనే జరిగాయని తెలిపారు.



రూ.1.68 కోట్లతో బీటీ రోడ్ల పనులను ప్రారంభించిన తలసాని

పెరిగిన ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో అండర్‌పాస్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసి, అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులు రద్దయ్యాయని ఆరోపించారు. తాను ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తలసాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, అమీర్‌పేట్ సర్కిల్ డీసీ సుజాత, డీఈ మహేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ హిందూజా, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎలక్ట్రికల్ ఏఈ శంకర్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, ఖలీల్, రాజేష్ ముదిరాజ్, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు పార్థసారథి, రమేష్ గౌడ్, అర్జున్ గౌడ్, జమీర్, సమి ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

కళల పుట్టినిల్లు తెలుగునేల : ఎపి ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు

నాంపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : రంగస్థల, సాంస్కృతిక కళలకు పుట్టినిలు తెలుగునేల అని, ఎన్నో ఏళ్లుగా వివిధ కళలు ఫరిడవిల్లుతూ కళాకారులు కళలే వృత్తి జీవిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడు రుద్రరాజు పద్మరాజు అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ సంస్థ కళలను, కళాకారులను ఇతోధికంగా ప్రోత్సహించడం శ్లాఘనీయమని సంస్థ, వ్యవస్థాపక అధ్యక్షుడు జి.కృష్ణ కళాసేవను కొనియాడారు. శృతిలయ, నృత్యాలకు లయకారకుడైన పరమశివుని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో త్రినేత్రం శిర్షికన నృత్యోత్సవాన్ని నిర్వహించి నాట్యకళాకారులను పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు జి.కృష్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రుద్రరాజు పద్మరాజు విశిష్ట అతిథులు అంజనీకుమారి, డా. శివనరసింహన్‌తంత్రి, జి.కృష్ణ, ఫర్వేజ్ తదితరులతో కలిసి ప్రముఖ శాస్త్రీయ నర్తకి,

అవార్డుతో రాగరంజనిని సత్కరిస్తున్న రుద్రరాజుపద్మరాజు, జి.కృష్ణ, నరసింహన్‌తంత్రి తదితర అతిథులు

రాగా ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ రాగరంజని తదితర పలువురు నర్తకీమణులను అవార్డులతో ఘనంగా సత్కరించి శుభాభి నందనలు తెలిపారు. నర్తకి రాగరంజని తన కళాప్రయాణంలో శత అవార్డులను అధిగమించి నేడు 101వ అవార్డును అందు కోవడం ఆమె కళాప్రతిభకు మైలురాయిగా నిలుస్తుందని అతిథు లు పేర్కొన్నారు. ఈ నృత్యోత్సవంలో కళాకారిణులు నాట్య విన్యాసాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుని తన్మయుల్ని చేశాయి.

ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న అక్రమ మద్యం పట్టివేత

ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యాన్ని తెలంగాణకు తరలించి విక్రయాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఉప్పల్ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకుని వారి వద్ద నుంచి భారీ ఎత్తున మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ మద్య నిషేధ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ షహ్నాజ్ ఖాసిం ఆదేశాల మేరకు ఎస్‌టిఎఫ్ టీమ్ హైదరాబాద్ సహాయ కమిషనర్ ప్రదీప్ రావు సూచనల ప్రకారం పోలీసులు ఉప్పల్ భగాయత్‌లో సోమవారం దాడులు నిర్వహించారు. డిల్లీ రాష్ట్రం నుండి అక్రమంగా కొనుగోలు చేసి తెలంగాణకు తరలించి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. నాన్-డ్యూటీ పెయిడ్ మద్యం కేసును పట్టుకున్నామని, వీరు డిల్లీలోని జిటి వైన్స్ నుంచి మద్యం కొనుగోలు చేశారని తెలిపారు. వీటిని ఉప్పల్ భగాయత్‌కు తీసుకుని వచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి మొత్తం 84 నాన్-డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.జానీ వాకర్ రెడ్ లేబుల్ 63 సీసాలు, టీచర్స్ 50 21 సీసాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, వీరిలో దమ్మిడి గోపాల కృష్ణా రెడ్డి, వల్లూజు ప్రసాద్, ఆదిత్య ప్రతాప్ లను పట్టుకున్నట్లు తెలిపారు. ఢిల్లీలో ఒక్కో సీసా రూ.1,125కు కొనుగోలు తెలంగాణలో సుమారు రూ.2,610 నుంచి.రూ.3,200లకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బిక్షారెడ్డి, పిఎస్ఐ బాలరాజు, ఇతర సిబ్బంది పాల్

నేడు అనయ డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్యశిభిరం

వనస్థలిపురం. జనవరి.9.ప్రభాతవార్త. హస్తినపురం డివిజన్ పరిధిలోని అనయ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం అనయ డిగ్రీ కళాశాలలో అపోలో హాస్పిటల్స్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరం లో గైనకాలజీ, చర్మవ్యాధులు, దంత పరీక్షలు, కంటి పరీక్షలు,బి.పి.మరియు షుగర్ పరీక్షలు నిపుణులైన వైద్యులచే నిర్వహించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కాలనీవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనాథ్ రెడ్డి కోరారు. ఈ శిబిరంలో ఉచిత పరీక్షలు చేసుకున్న వారికి అపోలో ఫార్మసీ వారు రాయితీతో మందులు పంపిణీ చేస్తారు.

హైదరాబాద్ కంప్రెషర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా రాజు

తుర్కయంజాల్ ఫిబ్రవరి9(ప్రభాతవార్త)

ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ ఇందిరమ్మ కాలనీ లో తుర్కయంజాల్ వడ్డెర సంఘం అధ్యక్షుడు నర్రా పాండు ఆధ్వర్యంలో హైదరాబాద్ కంప్రెషర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కంప్రెషర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కుంచం రాజు నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య మాట్లాడుతూ తుర్కయంజాల్ వడ్డెర సంఘం అభివృద్ధి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల శేఖర్, ఇరగదీన్ల మహేష్, బోదాసు వెంకటయ్య, పల్లపు చంద్రయ్య, గుర్రం వెంకటయ్య, ఓర్సు కృష్ణ, గుర్రం యాదయ్య, రాంబాబు, వెంకటేశు, శ్రీకాంత్, నర్రాశ్రీధర్, రమేష్, శ్రీహరి, ఇరగ దిండ్ల, హరీష్, తిరుపతయ్య, బోదాసు విజయ్, అభి, బొంద నరసింహ, బొంత నరేష్, వేముల విజయ్, ఓర్సు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

ముసారాంబాగ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

రానున్న అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మూసారంబాగ్ టీవీ టవర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద రూ. 4.50 లక్షల జిహెచ్ఎంసి నిధులతో చేపట్టనున్న స్టీల్ మెట్లు, ఫుట్ పాత్, ఇతర చిన్న చిన్న మరమ్మత్తు పనులను ఆమె స్థానిక బస్తీ వాసులతో కలిసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద మరమ్మత్తు పనులు చేసే అవకాశం తనకు లభించినందుకు చాలా సంతోషంగా ఉందని, మెట్ల దారి చిన్నగా ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆ సమస్య ఇపుడు తీరుతుందని వివరించారు. రానున్న అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకుందామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సత్యనారాయణ, ధనరాజ్, నర్సింగ్, దేవేందర్,రాము యాదవ్, యాదగిరి సురేందర్, నరసింహ, రంజిత్,భరత్,కొప్పుల దినేష్, బల్వంత్ ,సదానంద్, నందు, దయానంద్,పవ్వి కుమార్ ,తిరుమల్ ,బాల్ రాజ్ ,గిరి,శ్యామ్ తదితర బస్తీ వాసులు, మలక్ పేట్ మాల సంఘం ఇతర సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా నెహ్రూనగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

మల్కాజిగిరి ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

గౌతమ్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేశామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతరామ్ యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో 21 లక్ష రూపాయలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ రివిజన్ సమాగ్రాభివృద్ధికి కృషి చేశామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈ దివ్య జ్యోతి, బి ఆర్ ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాదర్‌గుల్ డివిజన్ కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి : నవారు మల్లారెడ్డి

కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్-57లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి తెలిపారు. డివిజన్‌లోని అల్మాస్‌గూడ న్యూ మధురాపురి కాలనీ ప్రధాన రోడ్డులో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యపై స్పందించిన ఆయన సోమవారం కాలనీ అధ్యక్షుడు డి.రాంరెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి పెరిగే ఇళ్లు, జనాభాకు అవసరాలకు తగ్గట్టుగా సక్రమంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. చిన్న సైజు డయా పైప్‌లైన్ల వల్ల డ్రైనేజీ సమస్యలు కలుగుతున్నాయనీ దీంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్, జిహెచ్ఎంసి కమీషనర్‌ల దృష్టికి తీసుకెళ్ళి అధిక సామర్థ్యం గల పెద్ద సైజు డయా డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేయిస్తానని ఆయన కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సోమన్న, యాదయ్యగౌడ్, ప్రేమ్ సాగర్ శర్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో లక్ష్యసాధన కోసం కృషి చేయాలి : ఎసిపి కృష్ణయ్య

మలక్ పేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావంతో తమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ భాష్యం పాఠశాల బ్రాంచ్ 13 వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, భాష్యం విద్యా సంస్థల సీఈఓ చైతన్య, జడ్ఇఓ అంకమ్మ లు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో పిల్లలు మొబైల్ ఫోన్లకి ఆకర్షితులవుతున్నాని, దీని నుండి పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. భాష్యం విద్యా సంస్థల సీఈఓ చైతన్య, జడ్ఇఓ అంకమ్మ లు మాట్లాడుతూ అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంతో ఆధునాతన పద్ధతిలో తమ పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు అన్ని అంశాలపై అవగాహన కలిగిస్తున్నామని వివరించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి పలు కార్యక్రమాల నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దిల్ షుక్ నగర్ భాష్యం పాఠశాల బ్రాంచ్ హై స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎసిపి కృష్ణయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న భాష్యం విద్యా సంస్థల సీఈఓ చైతన్య, చిత్రంలో జడ్ఇఓ అంకమ్మ, హై స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ భానుమతి తదితరులు

రూ.4.66 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

-హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణకు రూ.30 కోట్లు : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : నాచారం డివిజన్‌ను కోట్లాది రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం డివిజన్ పరిధిలో రూ.4 కోట్ల 66 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాచారం డివిజన్‌తో పాటు హెచ్ఎంటి నగర్ డివిజన్‌ను కూడా సమానంగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. అదేవిధంగా హెచ్ఎంటి నగర్‌లో రూ.70 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును రూ.30 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా నాచారం ప్రాంతంలో దోమల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సూరజ్, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు నాచారంలోని వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, బారాస నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ చేయూత : పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కొత్తగా ఎన్నికైన ఉప్పల్ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుని వచ్చారు. ముదిరాజ్ సంఘం భవనం, ఇతర అభివృద్ధి సంక్షేమ విషయాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ముదిరాజ్‌లకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి సైతం బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ముదిరాజ్‌లకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఈగ అంజయ్య, ఉపాధ్యక్షులు మంద చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి తలారి వినయ్ కుమార్, కార్యదర్శి ఈగ బాబు, సంయుక్త కార్యదర్శి తీగ దయాకర్, సాంస్కృతిక కార్యదర్శి కావాలి రాము, కమిటి సభ్యులు పిట్టల సాయిలు, కరుణాకర్, తీగ హనుమంతు, సలహాదారులు ఈగ ఈశ్వరయ్య, మహంకాళి వేణు, తలారి దానయ్య, తలారి కృష్ణ, తలారి వెంకటేష్, తలారి నర్సింగ్, మహంకాళి రాజు, తలారి జాంగిర్, ఈగ శ్రీనివాస్, తలారి వెంకటేష్, ఈగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉప్పల్ ముదిరాజ్ సంఘం నేతలు

అంతా మా ఇష్టం

-నిబంధనలు బేఖాతరు
-అనుమతి ఇచ్చుడు రద్దు చేసుడు
-అధికారుల తీరుపై పెదవి విరుపు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: అంతా మాఇష్టం అన్నట్లుగా ఉంది జి హెచ్ఎంసి అధికారుల తీరు. సంబంధం లేని వ్యవహారంలో తల దూర్చడం అనుమతులు ఇవ్వడం బయటకి పొక్కడంతో వాటిని రద్దు చేయడం. అనుమతి ఇవ్వడం వారి వంతే వాటిని రద్దు చేయడం వారి వంతే.. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనడానికి పిటిఐఎన్ నెంబర్ కేటాయించడమే అందుకు ఉదాహరణ. హయాత్ నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరబాద్‌లో వివాదాల్లో ఉన్న ఇంటికి సరూర్‌నగర్ సర్కిల్ అధికారులు 10503 15474 పిటిఐఎన్ నెంబర్ కేటాయిస్తూ క్లీన్ చీట్ ఇచ్చారు. ఈ విషయం బట్టబయలు కావడంతో తమకి ఎలాంటి సంబంధం లేదంటూ నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. ఇంటి అసెస్‌మెంట్ చేసేటప్పుడు సంబంధిత నివాసానికి వెళ్లి అధికారులు కొలతలు చేసి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అవేమీ లేకుండా నాలుగు గోడల మధ్య కంప్యూటర్లు క్లీన్ చిట్ ఇచ్చేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో పిటిఐఎన్ నెంబర్ రద్దు చేశామని చేతులు దులుపుకున్నారు. ఈ పని ఎవరు చేశారు? ఎలా జరిగింది? అనే కోనంలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఇంటి నెంబర్ కోసం వచ్చిన వ్యక్తి తప్పుడు పత్రాలు ఇచ్చాడని అతనిపై పోలీసు కేసు పెడతామని చెబుతున్న అధికారులు తప్పుడు పత్రాలతో ఇంటి నెంబర్‌కు క్లీన్ చిట్ ఇచ్చిన వారి గురించి మాత్రం మాట్లాడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. జి హెచ్ఎంసి అధికారులు చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప ఇంటి దొంగను కనిపెట్టడంలో మాత్రం శ్రద్ధ వహించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, ఏఎంసీ శ్రీనివాస్‌రావు లాగిన్ నుంచి ఫైలు ప్రక్రియ జరిగినప్పటికీ ఫైల్ క్లియరెన్స్ ఎలా జరిగింది అనే విషయంపై ఆరా తీయడంలో అధికారులు విఫలమయ్యారు.

తప్పుడు పత్రాలతో తమను తప్పుపట్టించాడని చెప్తున్నారే తప్ప ఫైలు క్లియరెన్స్ ఇచ్చిన వారిపై చర్యలు చేపడతామని మాత్రం అధికారులు ప్రకటించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది.

అదేవిధంగా అసెస్‌మెంట్ ప్రక్రియలో రెవెన్యూ విభాగం అధికారులు అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులు అవలంబిస్తున్న తప్పుడు విధానాలు త్వరలో వెలుగు చూడనున్నాయి.

ఛత్రపతి శివాజీ శక్త ర్యాలీ కరపత్రం ఆవిష్కరణ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: ఈ నెల 19వ తేదీన జరిపే ఛత్రపతి శివాజీ శక్తి ర్యాలీకి సంబంధించిన ప్రచార కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. నాదర్‌గుల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నిర్వహించే శివాజీ శక్తి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ ఉత్సవ సమితి బడంగ్‌పేట్ సర్కిల్ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు నడికుడ యాదగిరిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుర్రం మల్లారెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, నిమ్మల రవికాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

క్రీడలతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం: కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త : వినాయకనగర్ డివిజన్ పరిధిలోని మల్కాజ్‌గిరి డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల సమక్షంలో జీఎంసీ ద్వారా మంజూరైన క్రీడా సామగ్రిని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కళాశాలకు అందజేశారు. రాజ్య లక్ష్మి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి పునాది వంటివని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుందని, క్రీడల ద్వారా విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోగలరన్నారు. క్రీడల ద్వారా సమయ నిర్వహణ, క్రమశిక్షణ వంటి విలువ లు విద్యార్థుల్లో పెరుగుతాయని, ఇవి భవిష్యత్తులో జీవిత విజయానికి దోహదపడతాయని సూచించారు.

రోడ్డు ఆక్రమిస్తున్న చిరు వ్యాపారులు

డీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న గట్ల రవీంద్ర

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: రోడ్లు ఆక్రమించుకొని వీధి వ్యాపారాలు చేస్తున్నడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర నాయకుడు గట్ట రవీంద్ర (హైటెక్ రామ్) ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట చౌరస్తా ఓమిని ఆసుపత్రి నుంచి సరూర్నగర్ రైతుబజార్ వరకు సర్వీసు రోడ్డును ఆక్రమించుకుని వీధి వ్యాపారాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డును ఆక్రమించుకుని విధి వ్యాపారాలు చేయడం వల్ల పాదాచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య గురించి చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన చర్యలు చేపట్టలేదు అన్నారు. రోడ్డు ఆక్రమణ వల్ల అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. సర్వీస్ రోడ్లను ఆక్రమించుకొని వీధి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అదేవిధంగా లక్ష్మీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌రాజ్ కూడా ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

మహంకాళి దేవాలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు బాబు సుదర్శన్, పోచమ్మ దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

ఓల్డ్ మలక్ పేట్ ధోబీ గల్లి లోని మహంకాళి దేవాలయంలో దేవాలయం నిర్వాహకులు బాబు సుదర్శన్ ఆధ్వర్యంలో అమ్మవారి కళ్యాణంతో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాన్ని నిర్మించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పోచమ్మ దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, బిజెపి గ్రేటర్ కార్యదర్శి చీపురు రాజారావు గౌడ్, ప్రింటింగ్ ప్రెస్ యూనియన్ అధ్యక్షుడు బాబు రాజు,నాయకులు లక్ష్మణ్ గౌడ్, తాటికొండ శ్యామ్,నర్సింగ్ రావు,చౌకిరాజు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారికి అవార్డు

నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్ నుంచి అవార్డును అందుకుంటున్న చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి

మలక్ పేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి ఎక్స్ట్రా మైల్డ్ పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) లో జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ చేతుల మీదుగా చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారికి అవార్డు ను అందజేశారు. ఈ సందర్భంగా అవార్డును అందుకున్న ఇన్స్పెక్టర్ బ్రహ్మ మురారి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా విధులను నిర్వహిస్తూ శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నామని తెలిపారు. అవార్డును అందుకోవడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మార్పల్లి నుండి బస్సు సర్వీస్ పునఃప్రారంభం

ఆర్టీసీ అధికారులను సత్కరిస్తున్న గ్రామస్థులు

హయత్ నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

పెద్దఅంబర్ పేట డివిజన్ మర్పల్లి గ్రామం నుండి దిల్ సుఖ్ నగర్ వరకు నూతన బస్ సర్వీస్ ను సోమవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నల్లా నర్సింగ్ రావు ఆధ్వర్యంలో బస్సుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐదేళ్ల క్రితం కరోనా సమయంలో మర్పల్లి నుండి నగరానికి నడిచే బస్సు ను అధికారులు నిలిపివేశారు. అప్పటినుండి మర్పల్లి వాసులు ఆర్ కె నగర్ వరకు ఆటోల్లో వెళ్ళి అక్కడ బస్సు ఎక్కేవారు. మర్పల్లి నుండి బస్సు ను నడపాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నాయించినా ఫలితం లేక పోవడంతో సమస్యను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి విన్నవించామన్నారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు బస్సు సర్వీస్ ను పునర్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కు, ఆర్టీసీ అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

డివిజన్లలో సమస్యలు లేకుండా చూస్తాం

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్

హయత్ నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

నియోజకవర్గం లోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తామని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ మిధాని కాలనీలో 1.36 కోట్ల రూపాయలతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజి, పార్కుకు, డిఫెన్స్ కాలనీలలో 15 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రణాళిక బద్ధంగా శివారు కాలనీల్లో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ... ఐదేళ్లుగా డివిజన్‌లోని ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనే జీలు, వరద నీటి కాలువలు, వీధి దీపాలు వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. పనులను నాణ